క్లుప్తంగా

సంపత్ గణపతికి మారేడు దళార్చన



మారేడు దళాల నడుమ సంపత్ గణపతి

బోట్‌క్లబ్: చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయం ఆవరణలో ఉన్న సంపత్ గణపతి ఆలయంలో స్వామి వారికి గురువారం మారేడు దళాలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామి వారికి గరికపూజ చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఘనంగా గురజాడ జయంతి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రజా కవి గురజాడ అప్పారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు. సుబ్బారావు మాట్లాడుతూ తెలుగు వైతాళికుడు గురజాడ అని, సులభ, సుందర భాషలో సామాన్య ఇతి వృత్తాలను తీసుకుని చెప్పడమే గాక చేసి చూపిన కవి అన్నారు.

విద్యుత్ సర్వీస్‌కు ఆధార్ అనుసంధానం చేయండి

కాకినాడ రూరల్: విద్యుత్ వినియోగదారులు వారి విద్యుత్ సర్వీస్ నెంబర్‌కు ఆధార్ అనుసంధానం చేసుకోవలసిందిగా డీ4 సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ గౌతురాజు తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధార్ అనుసంధానం చేసుకోవడానికి స్థానికంగా ఉండే విద్యుత్ కార్యాలయంలో, స్థానిక లైన్‌మన్ వద్ద, ఆన్‌లైన్‌లో 'ఈస్టర్న్ పవర్ యాప్' గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 70132 45189, 74164 74440 ఈ నెంబర్లకు ఆధార్ జిరాక్స్, విద్యుత్ సర్వీస్ నెంబర్లు వాట్సాప్ చేసినా అనుసంధానం చేస్తారని ఆయన పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు



స్వామివారి ఎత్తైన విగ్రహం

కరప: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహం వద్ద గురువారం ఆలయ ధర్మకర్త చిక్కాల దొరబాబు, సావిత్రి దంపతులు హోమం, షష్టి పూజలు నిర్వహించారు. కాకినాడ-రామచంద్రపురం ప్రధానరహదారిలో కరప, పెనగుదురు గ్రామాల మధ్య ఆలయ ధర్మకర్తలు చిక్కాల దొరబాబు, సుబ్బారావు సోదరులు 51 అడుగుల స్వామివారి విగ్రహాన్ని గతేడాది నిర్మించారు. అప్పటినుంచి ప్రతి నెల షష్టిరోజున ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు దొరబాబు తెలిపారు. గురువారం భాద్రపద మాసం స్కంద షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి



పెద్దాపురంలో క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

పెద్దాపురం: ప్రతి విద్యార్థీ చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. స్థానిక మహారాణి కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. విద్య, క్రీడా రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇసోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, నల్లల గోవిందు, మండల విద్యాశాఖాధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యానం.. ఉల్లాసం..

- రూ.40 లక్షలతో పార్కు అభివృద్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు
- కాకినాడలో గాంధీనగర్ పార్కు తరువాత రెండో పెద్ద పార్కుగా గుర్తింపు
- కాలనీ వాసుల విన్నపంతో నిధులు మంజూరుకు ఎమ్మెల్యే కన్నబాబు కృషి



కాకినాడ 50వ డివిజన్ ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ శ్రీనివాసనగర్‌లో అభివృద్ధి చేస్తున్న పార్కు

కాకినాడ రూరల్: కాకినాడ నగరంలో గాంధీనగర్ పార్కు తరువాత ఏర్పాటైన రెండో పార్కుగా 50వ డివిజన్ ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో శ్రీనివాసనగర్ పార్కుకు గుర్తింపు ఉంది. సుమారు 52 ఏళ్ల క్రితం ప్రణాళిక బద్ధంగా ఈ పార్కును ఏర్పాటు చేయగా ఎస్‌బీఐ ఉద్యోగులు, స్థానికులు వినియోగించుకునేవారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కును 1982లో వారు అభివృద్ధి చేసుకున్నారు. 2006లో అప్పటి కార్పొరేటర్ ఐ.శ్రీను రూ.2 లక్షలు నిధులు మంజూరు చేయించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయగా స్మార్ట్ సిటీగా కాకినాడ ఎంపిక తరువాత పార్కును అభివృద్ధి చేయకుండా కేవలం ఓపెన్ జిమ్‌ను మాత్రం ఏర్పాటు చేశారు. స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్‌తో పాటు కాలక్షేపం కోసం అందుబాటులో ఉన్న ఈ పార్కును అభివృద్ధి చేయాలని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీ అసోసియేషన్ విన్నపం మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు స్థానికులతో చర్చించి వాకింగ్ ట్రాక్, చుట్టూ కాంపౌండ్ వాల్ ఎత్తు చేయడంతో పాటు రక్షణకు ఐరన్ గ్రిల్స్, ప్రవేశంలో మెయిన్ గేట్, పెయింటింగ్ వర్కు, చిన్నారులు ఆడుకునేలా క్రీడా పరికరాల ఏర్పాటుకు అంచనాలు తయారు చేయించి పనులు చేయిస్తున్నారు. పార్కులోపల వాకింగ్ ట్రాక్ నిర్మాణం, ప్రహరీ ఎత్తు పెంచి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు, మెయిన్ గేట్లతో పాటు నాలుగు వైపులా గేట్లు ఏర్పాటు చేశారు. దీంతో ఎస్‌బీఐ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచి, ఐరన్ గ్రిల్స్‌తో ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారం

చాలా కాలం తరువాత బాగుపడింది



50వ డివిజన్‌లో ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీ శ్రీనివాసనగర్ కాలనీ పార్కును చాలా కాలం తరువాత అభివృద్ధి చేశారు. ఈ ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దుక్కుతుంది. పార్కు దుస్థితిపై ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి నిధులు మంజూరుకు కృషి చేశారు. లైటింగ్ ఏర్పాటుకు విన్నవించాం.

– ఐ.శ్రీను, మాజీ కార్పొరేటర్, 50వ డివిజన్

చురుగ్గా పార్కు అభివృద్ధి పనులు

కాకినాడ కార్పొరేషన్ ద్వారా 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.40లక్షలతో ఎస్‌బీఐ స్టాఫ్ శ్రీనివాసనగర్ పార్కు అభివృద్ధి చేస్తున్నాం. చాలా వరకు పనులు పూర్తయ్యాయి. 14వ ఆర్థిక సంఘ నిధులుతో వాకింగ్ ట్రాక్ చుట్టూ లైటింగ్‌కు ప్రతిపాదించాం.

– విరూపాక్షరావు, ఏఈ, నగరపాలక సంస్థ

ఎస్సీ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి



ఇందిరాకాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

కరప: ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నివాశిత ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రశాఖ అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. డ్రెయిన్లు, రోడ్లు, శ్మశానవాటికలు వంటి వసతులు లేక ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర దళిత రక్షణ యాత్ర సందర్భంగా గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకుల బృందం గొర్రిపూడిలో ఇందిరాకాలనీని సందర్శించి, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ దళితులకు శ్మశాన స్థలం కొనుగోలుచేసి ఇవ్వాలని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 1235 జీఓ ఇచ్చారని, ప్రస్తుత సీఎం జగన్ కూడా ఆ మేరకు కలెక్టర్లకు సర్క్యులర్ పంపారన్నారు. అధికారులు స్పందించి ఇక్కడ శ్మశాన స్థలాన్ని కేటాయించాలని, డ్రెయిన్‌పై ఉన్న ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు టి.ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్, పొట్లకాయల కృష్ణ, శివకోటి అర్జున తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్, అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల నియామక కమిటీ చైర్మన్ కృతికా శుక్లా శుక్రవారం తెలిపారు. కాకినాడ ప్రాజెక్టులో ఒకటి, తాళ్లరేవు ప్రాజెక్టులో ఒకటి మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. అలాగే పెద్దాపురం ప్రాజెక్టులో 1, కాకినాడ అర్బన్‌లో 1, కాకినాడ రూరల్‌లో 2, తాళ్లరేవులో 4, పిఠాపురం 3, పెద్దాపురం 1, శంఖవరం 1, తుని 4, జగ్గంపేట 4, ప్రత్తిపాడు 1 మొత్తం 21 అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నందున అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులు ధ్రువపత్రాలతో సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ సహాయకుల కోసం..

కాకినాడ రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ సహాయకులు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. తూరంగి-3 కోడ్ నంబరు 0420230లో ఎస్టీ, కొవ్వూరు గ్రామంలో కొవ్వూరు-2 కోడ్ నంబరు 0420223 సెంటరులో ఓసీ జనరల్‌కు కేటాయించడంతో ఆయా ఖాళీల భర్తీకి ఈనెల 29 సాయంత్రం 5 గంటలోపు సర్పవరంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చని సీడీపీఓ లక్ష్మి తెలియజేశారు.

అలరించిన వివేక్ గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న వివేక్ మొళికుళమ్

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో శ్రీరామసమాజం ఆధ్వర్యంలో గణపతి సంగీత హరికథా మహోత్సవాలు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం సంగీత విద్వాంసులు వివేక్ మొళికుళమ్ గాత్ర కచేరీ అలరించింది. ముందుగా జయంతి సత్యనారాయణశాస్త్రి జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. వివేక్ సౌరాష్ట్ర రాగంలో శ్రీగణపతిని సేవించరావే కీర్తనతో కచేరి ప్రారంభించారు. తదుపరి మోహన, ఆరభి, కాంభోజి తదితర రాగాలలో ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలు ఆలపించారు. వీరికి వయోలిన్ విద్వాంసులు పప్పు జ్ఞాన దేవ్, మృదంగం విద్వాంసులు బుర్రా శ్రీరామ్, ఘటం విద్వాంసులు రామకృష్ణ చక్కని సంగీత సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాజం కార్యదర్శి మునుగంటి వెంకట్రావు, జి.అరుణ తదితరులు పాల్గొన్నారు. పి.మల్లికార్జునరావు, జగన్నాథ సుబ్బారావు, ఎస్‌కేవీడీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు మాధవపట్నం విద్యార్థులు



జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సెలక్షన్ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు

సామర్లకోట: జిల్లా స్థాయి పాఠశాల క్రీడలకు మండల పరిధిలోని మాధవపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు నియోజక వర్గ సెలక్షన్ కమిటీ అధ్యక్షుడు యార్లగడ్డ బంగార్రాజు గురువారం రాత్రి స్థానిక విలేకర్లకు తెలిపారు. పెద్దాపురం మహారాణి కళాశాలలో నియోజక వర్గ స్థాయి పోటీలను నిర్వహించారు. వాలీబాల్ అండర్ 17 విభాగంలో డి.రాజేష్, ఖోఖో జట్టుకు వి.నందేశ్వర్, 1500 మీటర్ల పరుగు పోటీకి డి.రాజేష్, అండర్ 14 విభాగం త్రోబాల్‌కు కె.జాన్సన్ ఎంపికయ్యారని తెలిపారు. హెచ్‌ఎం ఎల్.గోవిందు, పీడీ ఎం గోవిందులు విద్యార్థులను అభినందించారు.

హైవేపై ఎమ్మార్పీఎస్ నేతల ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పిఠాపురం: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం గొల్లప్రోలు మండలం వన్నెపూడి సమీపంలో జాతీయ రహదారిని నిర్బంధించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు తొమ్మండ్ర హేమంత్, మధు, పలివెల నవీన్ తదితరులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి నాయకులతో చర్చించడంతో ఆందోళన విరమించారు.

శివశక్తిపై సామవేదం ప్రవచనం

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని పైండా చలమయ్య కల్యాణ మండపంలో ఈ నెల 26న సాయంత్రం 6.30 గంటలకు శివశక్తి అంశంపై ప్రవచన కర్త సామవేదం షణ్ముఖ శర్మ ప్రవచనం చేయనున్నట్టు కల్యాణమండపం చైర్మన్ పైండా వేంకటేశ్వరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆలయ అర్చకుని తీరుపై విచారణ

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి తురంగేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు భక్తులకు అందుబాటులో ఉండకపోవడంతో స్థానిక నాయకుడు కర్రి రాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్ ఆలయానికి వచ్చి విచారణ చేపట్టారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ పాలనలో ఉండడంతో శాశ్వత అధికారిని నియమించాలని భక్తులు, ఫిర్యాదుదారులు కోరినట్లు తెలిపారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు ఫణీంద్రకుమార్ వివరించారు. విచారణలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లపల్లి బాబులు, ఆలయ ఇన్‌చార్జి ఈఓ శ్రీనివాసరావు, సహాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ అవగాహనపై రేపు 5కె రన్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కల్పించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం రెడ్ రన్ మారథాన్ పేరుతో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాయక్, డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ గురువారం తెలిపారు. ఈ రన్ ఉదయం 6 గంటలకు స్థానిక భానుగుడి నుంచి సర్పవరం వరకు సాగి, తిరిగి భానుగుడి జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రన్‌లో పాల్గొనే వారికి వయో పరిమితి లేదన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.7వేలు, మూడో బహుమతి రూ.5వేలు, నాలుగో స్థానం నుంచి పదోస్థానంలో వచ్చిన వారికి ఒకొక్కరికి రూ.వెయ్యి చొప్పున అందిస్తామన్నారు. ఈ రన్‌లో పాల్గొనడానికి ఆసక్తి గల వారు శుక్రవారం సాయంత్రం ఐదు గంటల లోపు తమ పేర్లను జిల్లా క్రీడాప్రాధికారం సంస్థ కార్యాలయం, వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాల్లో ఏదో ఒక దానిలో నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 94403 45245 నెంబరులో సంప్రదించాలని కోరారు.

బీజేపీతోనే మహిళాభివృద్ధి

బోట్‌క్లబ్: బీజేపీతోనే మహిళాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మజ అన్నారు. గురువారం కాకినాడలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. అభివృద్ధి చెందిన భారత్‌గా అవతరించాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ జనాభాలో సగం ఉన్న మహిళలకు పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టారన్నారు. మహిళలకు చట్టసభల్లో కూడా 33 శాతం రిజర్వేషన్లు పెంచడం ద్వారా పాలన నిర్ణయాధికారంలో వారిని భాగస్వాములను చేయడం గొప్ప నిర్ణయమన్నారు.

ఉపాధ్యాయినిపై విచారణ

కాకినాడ సిటీ: కాకినాడలో ఎస్ఎస్ఆర్‌కె నగరపాలక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని మంగతాయారు విద్యార్థినుల జడలు కత్తిరించిన విషయమై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి అధ్యక్షతన గురువారం విచారణ చేపట్టారు. బాధిత బాలికలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అలాగే టీచర్‌పై తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఇటువంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు, ఎస్ఐసీ పీవో బి.రామకోటి, సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ శైలజ, ఎంఈవో రవి పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

కాకినాడ క్రైం: సముద్రంలో చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ దుమ్ములపేట తారకరామనగర్‌కు చెందిన తిక్కాడ రాజు (42) బుధవారం మధ్యాహ్నం కుంభాభిషేకం రేవు నుంచి చేపల వేటకు వెళ్లాడు. గురువారం తిరిగి వస్తుండగా హోప్‌ఐలాండ్ సమీపంలో అలల తాకిడికి సముద్రంలో పడిపోయాడు. సహ మత్స్యకారులు అతడిని రక్షించి పడవపైకి చేర్చారు. అలా చేసిన కాసేపటికే రాజు మృతి చెందాడు. ఈ ఘటనపై కాకినాడ పోర్టు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం చేయాలి



పారిశుధ్య కార్మికులకు పీపీఈ కిట్లను అందజేస్తున్న ఆదిలక్ష్మి తదితరులు

కరప: కాలుష్యానికి కారణమవుతున్న ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి ఇంటికీ కరపత్రాలు పంచాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి సూచించారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా గురువారం నడకుదురు పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని, ఇదే విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులు విక్రయించినా, వినియోగించినా జరిమానా విధిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు సేఫ్టీ జాకెట్లు, గ్లోవ్స్, సబ్బు, మాస్కులతో కూడిన పీపీఈ కిట్లను పారిశుధ్య కార్మికులకు ఆదిలక్ష్మి అందజేశారు. అనంతరం పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ డేగల లలితకుమారి, కార్యదర్శి పీఎస్ఆర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వర్షం



కరప ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిలచిన వర్షపు నీరు

పల్లపు ప్రాంతాలు జలమయం



కరప పోలీసుస్టేషన్ వద్ద వర్షపు నీరు

కరప: అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి, గురువారం ఉదయం వర్షం ముంచెత్తడంతో మండల పరిధిలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కుండపోత వర్షానికి జనజీవనం స్తంభించింది. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పలు గ్రామాల్లో డ్రైన్లు లేక వీధుల్లో, రోడ్లపై, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల ఆవరణలో నీరు నిలబడిపోయింది. ఎంపీడీఓ కార్యాలయాల వద్ద వర్షం నీరు నిలబడిపోవడంతో సిబ్బంది, వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో కురుస్తున్న వర్షానికి తోడు పై మండలాల నుంచి ముంపునీరు వచ్చి చేరుతుండటంతో పంట, మురుగుకాలువలు పొంగుతున్నాయి. కడియం, బిక్కవోలు, పెదపూడి తదితర మండలాల్లోని ముంపునీరు వచ్చి చేరడంతో తుల్యభాగ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. ఉదయాన్నే వర్షం పడటం వల్ల కాకినాడ వెళ్లే జట్టుపనివారు, భవన నిర్మాణ కార్మికులు ఇళ్లకే పరిమితమయ్యారు.

ఎన్‌జీటీ ఆదేశాల మేరకు సంస్కరణలు

కమిషనర్ నాగనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు పలు సంస్కరణలు అమలు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. తడి-పొడి చెత్త సేకరణ, చెత్తను ప్రాసెసింగ్ చేయడం, ఘనవ్యర్థాల నిర్వహణ సహా ఆయా అంశాలపై అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి డాక్టర్ వసంత మాట్లాడుతూ సంస్థ పర్యవేక్షణలో ట్రిబ్యునల్‌పై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఈఈ మాధవి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

- జిల్లా ఇమ్యునైజేషన్ విశ్రాంత అధికారి డీవీవీ
- కస్టమ్స్ హౌస్‌లో స్వచ్ఛతా హి సేవ

కాకినాడ సిటీ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ప్రముఖ వైద్యుడు, జిల్లా ఇమ్యునైజేషన్ విశ్రాంతి అధికారి డీవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం కస్టమ్స్ హౌస్‌లో గార్బేజ్ ఫ్రీ ఇండియా ఆధ్వర్యంలో కాకినాడ కస్టమ్స్ డిప్యూటీ కమిషనర్ కె.విజయకుమార్ పర్యవేక్షణలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలే వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిశుభ్రతను పాటించాలన్నారు. సామాజిక కార్యకర్త అల్లూరి సురేంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. ఓషన్ సొసైటీ ఆఫ్ ఇండియా, కాకినాడ కస్టమ్స్ హౌస్ సంయుక్తంగా నిర్వహించిన తీరప్రాంత పరిశుభ్రతలో కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహరావు పరిశుభ్రతపై వైద్యులు, సేవా సంస్థల ప్రతినిధులు ఇచ్చిన ఆరోగ్యకరమైన సేవలను ప్రశంసించారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న కస్టమ్స్ అధికారులు కె విజయకుమార్, సీహెచ్‌వీ వెంకటరెడ్డిలను అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎంవీఆర్ ఫణీంద్ర, కస్టమ్స్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి రైతే వెన్నెముక

- బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు గోపు
- ఘనంగా రైతు దినోత్సవం



గోపూజ చేస్తున్న నారాయణమూర్తి, రైతులు

పెద్దాపురం: దేశానికి రైతే వెన్నెముక అని, రైతు లేనిదే అభివృద్ధి సాధ్యపడదని భారతీయ కిసాన్ సంఘ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపు నారామణమూర్తి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. బలరాముని జయంతి, రైతు దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం మండలంలోని కాండ్రకోటకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూకాలమ్మ ఆలయం వద్ద రాసంశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో వారు మాట్లాడుతూ బలరాముడు, నాగలి, గో పూజ విశిష్టత గురించి వివరించారు. అనంతరం కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించి గోపూజ, నాగలి పూజ నిర్వహించారు. తొలుత బలరాముడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, గోపు దొరబాబు, గవరసాని రాజశేఖర్, లక్కాకుల కృష్ణ రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బలరాముడి జయంతి

పిఠాపురం: మండలంలోని ఎల్ఎస్ పురంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో బలరాముడి జయంతి వేడుకలు నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత బలరాముని ఆదర్శంగా తీసుకుని వ్యవసాయ రంగం వైపు పయనించాలని కోరారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ కాకినాడ శాఖ నాయకులు రాసంశెట్టి రాజా, గట్టి అశోక్, అన్నం గోపాలరావు, మొండి సత్యనారాయణ, కుంచే నాగేశ్వరరావు, నల్లల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.